ప్రవల్లిక అయోమయంగా విహారివైపు చూసింది. అది ఓ నిర్వికార అచేతనావస్థ విషాదంకన్నా ఎక్కువయింది. వేదాంతం కన్నా తక్కువ మెట్టులో వుంది. విద్యుద్ఘాతంలా తగిలింది. ఆమె కళ్ళముందో దృశ్యం కదలాడింది. నాటకం స్టేజీమీద సునాదమాలా ఇతడు వెల్లకిలా పడుకున్న దృశ్యం అది. తను అతని బరువు చెప్పగానే ఇతడు బహుశా ఫోన్ చేస్తున్నది ఈ అమ్మాయి అనుకుని వుంటాడు. అతడు ఆడ పోలీసు ఆఫీసర్లు గొంతు గురించి తేలికగా మాట్లాడటంతో తను కల్నల్ వేషం వేసింది.

అంతవరకూ ఫర్వాలేదు.

తాడు తెగేవరకూ

ఆమెకు నవ్వొచ్చింది. దుఃఖంతో కూడిన నవ్వు అది. తనమీద తనకే తెలియని కసి.

క్షణాల్లో సర్దుకుని “ఏం లేదు నాన్నా! తర్వాత చెపుతాను. మీరు లోపలికి రండి. లోపల మాట్లాడుకుందాం” అని మాలని లోపలికి పిలిచింది. బ్రతుకు జీవుడా- అనుకుంటూ మాల ఆమెతో లోపలికి వెళ్ళింది.

లోపలికెళ్ళాక కబుర్లలో దింపుతూ “మీ ఇద్దరికీ పరిచయం ఏలా జరిగింది?” అని అడిగింది. మాల జరిగింది మొత్తం మొదటినుంచి చెప్పేసింది. ప్రవల్లికకి జరిగిందంతా అర్థమైంది. మెడికల్ షాప్ దగ్గిర తనకి బదులు ఈ అమ్మాయిని పట్టుకుని నిలదీయటం వగైరా ఇప్పుడు గుర్తొచ్చింది.

ఆమె మాలవేపు చూసింది.

స్వచ్ఛంగా, అమాయకంగా కనపడుతోంది.

ఆమె ఒక నిర్ణయానికి వచ్చేసింది.

జీవితానికి కామాలే కానీ ఫుల్‌స్టాపులుండవు. మరణమే చివరిది. ఈ అధ్యాయం ఇక్కడితో ముగిసింది. మిగతాది ధ్యేయమే. తన ఆఫీసులో మరికొంత ఎక్కువసేపు సాయంత్రాలు.

కొంచెం సేపు మాట్లాడి విహారీ వాళ్ళూ వెళ్ళిపోయారు.

ఆమె ప్రతాపరావు దగ్గరకొచ్చి నిలబడింది కంఠం మార్చటం, భావాల్ని మొహంలో ప్రతిబింబింప జెయ్యకుండా వుంచగలగడం సి.బి.ఐ.లో సాధ్యమేమో కాని, నిజ జీవితంలో కాదు. ఆమెని ప్రతాపరావు గమనించాడు. అయితే ప్రశ్నలేమీ అడగలేదు. విహారి మాటల్లోనే అతడికి జరిగిందంతా తెలిసింది. సానునయంగా భుజం తట్టాడు. “బాధపడుతున్నావా అమ్మా?” అన్న ప్రశ్న ఆ స్పర్శలో వుంది. ఆమె లేదన్నట్టు తలూపింది. ‘రాసి వుండాలి - నుదుట వ్రాసి వుండాలి’ అన్న జవాబు అది.

* * * *

సునాదమాలని ఫాలో అవుతున్న అనుచరులు ఆమె ఒక వీధిలోకి ప్రవేశించగానే ఆ విషయాన్ని రామ్‌లాల్‌కి వైర్‌లెస్‌లో తెలిపారు. క్షణాలలో అతడు అక్కడికి వచ్చాడు.

ఆశ్చర్యపడ్డాడు. సరిగ్గా ప్రవల్లిక  బంగ్లాకి వెనుక వేపున్న ఇల్లు అది. మూడో కంటికి తెలియకుండా ఆ ఇంట్లోంచి ఈ ఇంట్లోకి రావొచ్చు.  ప్రవల్లిక ఈ విధమైన ఏర్పాటు చేసిందన్నమాట అనుకున్నాడు.

శబ్దం కాకుండా లోపలికి ప్రవేశించాడు.

అప్పుడే “నా డ్యూటీ అయిపోయిందమ్మా, ఇక నీది” అంటున్నాడు ప్రతాపరావు. A-5 ఇంకా స్పృహరాని స్థితిలోనే పడుకుని వున్నాడు.  వంతులవారి కాపలా కాస్తున్నారు వాళ్ళిద్దరూ. అతను అక్కడ దాచబడిన సంగతి ఇప్పటివరకూ నలుగురికే తెలుసు.  ఇప్పుడు శత్రువులకి కూడ తెలిసిపోయింది.

ఆమెకి చాలాసేపు ఒంటరిగా కూర్చుని విహారి గురించి ఆలోచించుకోవాలని వుంది. ఆలోచించటానికేమీ వుండదు.  ఆలోచన వుంటుంది, అదే ప్రేమంటే.

వెళ్ళటానికి ఉద్యుక్తుడవుతూ ఆగి, జేబులోంచి ఒక మెడల్ తీస్తూ  “నిన్న అడిగావు కదా పరమవీరచక్ర అంటే ఎలా వుంటుంది అని ఇదిగో” అంటూ చూపించాడు.  ఆమె దాన్ని అందుకుని చదవటమూ వినటమే కానీ చూడలేదెప్పుడూ. ఆమె దాన్ని స్పృశించింది. మెడల్ గొప్పగా లేదు.  ఖరీదయినది కూడా కాదు.  కానీ కోట్లమంది ప్రజల ప్రతినిధిగా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఇచ్చింది అది. ఆమె చేతివేళ్ళు అప్రయత్నంగా వణికాయి.

ఈ లోపున రామ్‌లాల్ మరో అడుగు ముందుకెళ్ళాడు. అతడి కాలిక్రింద కాగితం నలిగిన చప్పుడయింది. సైన్యంలో అనుభవం  ప్రతాపరావుని హెచ్చరించింది. కానీ అప్పటికే ఆలస్యం అయింది.

మెరుపుకన్నా వేగంగా రామ్‌లాల్ కత్తి ముందుకొచ్చింది. సునాదమాల కెవ్వున అరిచింది.

## *19*

వాతావరణంలో  మార్పుని ప్రవల్లిక పసిగట్టింది.  ఆఫీసు ఇంతకు ముందులా లేదు. ఏదో మార్పుంది.

ఆమె దాన్ని పట్టించుకోకుండా వెళ్ళి సీట్లో కూర్చుంది. రెండు నిమిషాల తర్వాత చీఫ్‌నుంచి పిలుపొచ్చింది.

“మె ఐ కమిన్ సర్.”

“ప్లీ జ్....”

ఆమె వెళ్ళి ఎదుటి సీట్లో కూర్చుంది. చీఫ్ అదోలా వున్నాడు.  “ఎంతవరకూ వచ్చింది నీ ఇన్వెస్టిగేషన్?”

ఆమె నవ్వింది.  “ఇన్వెస్టిగేషన్‌కేముంది సర్. నేరస్తులు ఎవరో తెలుసు, నేరం మోపటమెలాగో తెలియటంలేదు.”

“ఆస్పత్రి నుంచి పేషెంట్‌ని తీసుకువెళ్ళి ఎక్కడ దాచావు ప్రవల్లికా?”

“తెలీదు సార్.”

"మొన్న అడిగినప్పుడు కూడా అదే సమాధానం చెప్పావు. నేను దానిని అంతగా పట్టించుకోలేదు. చట్టబద్ధంగా ప్రతీ పనీ చేయలేనప్పుడు. కొన్ని అవుట్-ఆఫ్-ది వే తప్పదని నాకూ తెలుసు. ఆ దారిలోనే నువ్వూ వెళుతున్నావని వూరుకున్నాను. నీ సిన్సియారిటీ, అనంతానంత స్వామి పట్ల నీ వైరం నాకు తెలుసు. నేను ఆయన భక్తుణ్ని, కాని నువ్వు చెప్పినదంతా నిజమైన పక్షంలో ఆయన్ని ఉరికంబం ఎక్కించటానికి ప్రయత్నించే మొదటి వ్య క్తిని కూడా నేనే."

ఆమెకు హాయిగా అనిపించింది. ".....థాంక్స్ సర్" అంది.

"కానీ మనం ఆలోచించిన దారిలో పై వాళ్ళు ఆలోంచాలని లేదు" ఆయన ఆగాడు. కొంచెం సేపు ఇబ్బందికరమైన నిశ్శబ్దం. దాన్ని చీలుస్తూ ఆయన అన్నాడు- "ఒక ముఖ్య మైన సాక్షిని ఆస్పత్రి నుంచి తప్పించి శత్రువులకు అప్పగించావు. అన్న నేపం మీద డిపార్టుమెంట్ నిన్ను సస్పెండ్ చేస్తోంది ప్రవల్లికా - ఇదిగో ఆర్డరు."

ఆమె విద్యుద్ఘాతం తగిలిన దానిలా నిశ్చేష్టురాలై అలాగే చూస్తూ వుండిపోయింది. మొదట కొంచెంసేపు ఆయన శరాఘాత అవశేషమైంది. శరీరం మంచులో పెట్టినట్టు చల్లగా అయిపోయింది. గుండెల్లో దుఃఖం కళ్ళలోంచి రాలేదు. మరింత బాధపెట్టటానికా అన్నట్టు మనసులోనే వుండిపోయింది.

చుట్టూ ఫైల్స్ అలాగే వున్నాయి.

ఫ్యాన్ మామూలుగా తిరుగుతూనే వుంది.

పాత కర్టెను- కుర్చీలు- బల్లలు- ప్రభుత్వ బ్యూరోక్రసీకి నిదర్శనంగా అలాగే వున్నాయి.

"సారీ ప్రవల్లికా!" అన్నాడు ఛీఫ్. ఆమె మాట్లాడలేదు.

ఆ ఆర్డరు అందుకోవటానికి కూడా ఓపిక లేనట్టు అలాగే కూర్చుని వుంది. గుండెల్లో జలపాతం హోరు, మెదడులో అగ్నిపర్వత విస్ఫోటనం. ఆమె రెండిటి మధ్యా బడబాగ్నిని దాచుకుని నిశ్శబ్ద కడలి గర్భం.

ప్రేమ విఫలమైనప్పుడు కూడా ఆమె ఇంత బాధపడలేదు. లక్ష్యం వేరే నిర్ణయించుకుంది. జీవితాశయం ఒక్కటే గమ్యంగా మానసికంగా సర్దుకుంది.

కానీ ఇప్పుడు?

ఉద్యోగం పోయింది.

కాదు శత్రువు జాగ్రత్తగా వలపన్ని పట్టుకున్నాడు. దొరికిన జంతువుని చంపలేదు. కాళ్ళు విరిచేసి నిస్సహాయం చేసి ఆనందిస్తున్నాడు. లేకపోతే చీఫ్ ఇంత తొందరగా తిరిగి పదవిలోకి రాడు, తనమీద ఏ సాక్ష్యమూ లేకుండా ఇంత బలంగా నేరం మోపబడి, సస్పెన్షన్ ఆర్డరు చేతికి రాదు.

........ ఆమె లేచి నిలబడింది.

వచ్చినందుకు తిరుపతి వెళ్ళి వచ్చినట్టున్నాడు. ఆమె వైపు జాలిగా చూస్తున్నాడు. ఆమెకి తనమీద తను జాలిపడాలో, అతడి మీద జాలిపడాలో అర్థంకాలేదు.

ఆర్డరు తీసుకుంది.

ఎలెర్ట్‌గా నిలబడి సెల్యూట్ చేసింది.

గదిలోంచి నిశ్శబ్దంగా బయటికి వచ్చింది.

విశాలమైన వరండా.

ఎత్తయిన మెట్లు.

విరిగిపోయిన చెట్టుకొమ్మ. ఆధారంలేక వాలిపోయిన కుర్చీ, పనికిరాని పాత సామాన్ల రూము.... ఈ దేశపు యంత్రాంగంలా....

ఆమె అదే మూడ్‌లో ఇంటికొచ్చింది.

ప్రతాపరావు ఇంట్లో లేడు. వెనుక దారిగుండా చిన్న ఇంటిలోకి ప్రవేశించింది. ఆ ఇల్లు నిశ్శబ్ధంగా వుంది. తండ్రి అటువైపు తిరిగి కూర్చుని వున్నాడు.

ఆమెలో అప్పటి వరకూ అణగ దొక్కబడి వున్న కసి, ఉద్వేగం, ఉక్రోషం- అన్నీ ఒక్కసారిగా బయటపడ్డాయి. "నాన్నా....." అంది. కోపంతో వణుకుతూన్న కంఠంతో.

"......దేశం నాకేమిచ్చిందీ అనికాదు- దేశానికి నేనేమిచ్చాను" అని ఆలోచించాలి అన్నారట చరిత్రకారులు. "ఈ దేశం గురించి నీకేమైనా తెలుసా నాన్నా! ఇక్కడ బుద్ధుడు పుట్టాడట. ధర్మం నాలుగు పాదాలా నడిచిందట వెళ్ళిపోయింది నాన్నా, నడుచుకుంటూ ఎక్కడికో అది వెళ్ళిపోయింది. ఇక్కడ ప్రతి పవిత్ర నదీ జలమూ లంచగొండి తనంతో నల్లగా కల్మషమైపోయింది. ఇక్కడ ప్రతీ పచ్చబొట్టూ రెడ్‌టేపిజంతో ఎర్రగా పుచ్చిపోయింది. వీటికి అతీతంగా పనిచేద్దామనుకున్నందుకు ఈ దేశం ఇచ్చిన బహుమతి ఏమిటో తెలుసా నాన్నా?.... సస్పెన్షన్ ఆర్డర్" ఆమె దగ్గరగా వెళ్ళి అంది. "చేసిన ప్రతి పనికీ లాభం ఉండనవసరం లేదు నాన్నా! కానీ గుర్తింపు ఉండాలనుకోవటం స్వార్థం కాదుగా. చెప్పు నాన్నా" అంటూ కుదపబోయి ఆగిపోయింది.

గుండెల్లోంచి కారిన రక్తంతో నాడి తడిసిపోగా, ఆయన ముందుకు కూలిపోయాడు.

చేతిలో మెడల్ అలాగే వుంది ఆమెని గుర్తించినట్టు! "నాన్న నాన్న--" ఆమె మాటలు గొంతులో కొట్టుకుంటున్నాయి. మోకాళ్ళ మీద వంగి, తండ్రి కాళ్ళ దగ్గర కూర్చుంది.

'ఒక సైనికుడు మరణించినంత మాత్రాన యుద్ధం ఆగిపోదు' అన్నట్టు ఆ మెడల్ వూగుతోంది.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది... యిది మూడో దెబ్బ. భాగస్వామి విషయంలో ఓడిపోయినప్పుడు తండ్రి నుంచి స్ఫూర్తి పొందుదామనుకుంది. ఆమెకతడు తండ్రే కాదూ- గైడ్ కూడా.....

చుట్టూ చూసింది.

పక్క గదిలో రక్తపు మడుగులో A-5 పడి వున్నాడు.

*    *    *    *

సునాదమాల విహారి వేపు భయంగా చూసింది. అతడి మొహం కందగడ్డలా మారి వుంది. కోపం, విశాదం అన్నీ మిళితమై వున్నాయి.

అరగంట క్రితం గడిచిన సంఘటన ఒక సజీవ చిత్రంలా ఆమె ముందు ఇంకా కదులుతూనే వుంది.

మృత్యువుని అంత సమీపంలో చూడవలసి వస్తుందని ఆమె వూహించలేదు. పక్క మనిషి ఆమె చూస్తూ వుండగానే రక్తం జివ్వున చిమ్మింది. "రన్.... మాలా.... రన్" అని అరిచాడు ప్రతాపరావు. మరోసారి కత్తి అతనిలో దిగింది. ఆమె బయటకు పరుగెత్తింది. అప్పుడే స్పృహ వస్తున్న A-5ని రామలాల్ చంపటమే ఆమెకు తెలుసు. విల్లు వదిలిన బాణంలా ఆమె రోడ్డుమీద కొచ్చింది. ఇంటికెలా చేరుకుందో ఆమెకే తెలీదు. స్పృహ తప్పింది. కళ్ళు తెరిచేసరికి విహారి వున్నాడు.

"నాకేం తెలీదు - నాకేం తెలీదు" అందామె భయంగా- "నేను జాగ్రత్తగానే వెళ్ళాను. ఆయన తన మెడల్ చూపిస్తూండగా వెనుక నుంచి ఎవరో వచ్చి-"

"నాన్సెన్స్! నీకూ, నాకూ ఆ ఇద్దరికీ తప్ప మరెవరికీ ఆ చోటు తెలీదు." పక్కనున్న ముక్కాలి పీటని బలంగా కాలితో తన్నాడు. ఆ కొట్టడంలో కోపమూ? నిస్సహాయతా, తమ మనిషి చనిపోయాడన్న కసీ వున్నాయి.

విసురుగా వెళ్ళి పీట కొట్టుకోవడంతో బల్ల కదిలింది. దానిమీద ఉన్న తాయెత్తు క్రిందపడింది.

సున్నితమైన జాయింటు వున్న అంచు నేలకి తగలటంతో, అది రెండుగా విడిపోయింది.

స్వామి బలమైన కోట లోపలికి వెళ్ళడానికి మరో ద్వారం తెరుచుకున్నట్టు - లోపల్నుంచి మైక్రోఫోన్ బయటపడింది.

ఒక్కసారిగా ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. ముందు తనే తేరుకున్నాడు.

వంగి ఆ తాయెత్తుని చేతుల్లోకి తీసుకున్నాడు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఆ తాయెత్తు ఒక మెగాటన్ బాంబులా కనపడింది. ఇంతకాలం తమ రహస్యాలు ప్రత్యర్థులకి ఎలా తెలుస్తున్నాయో ఇప్పుడు అర్థమైంది.

"ఏమిటది?" అడిగింది సునాదమాల.